క్లుప్తంగా

ఆరుగురిపై కేసునమోదు

ఊట్కూరు: మండలంలోని ఆవులను అమ్మిన ఆరుగురిపై బుధవారం కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ గోకరి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గ్రామంలో పలు ఆలయాలకు, సంబంధించిన ఆవులను గ్రామానికి చెందిన కొంతమంది తమ పంట పొలాలను రాత్రివేళలో పాడుచేస్తున్నాయంటూ గుట్టుచప్పుడుకాకుండా అమ్మేశారు. ఈ విషయమై గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ చిత్రపటానికి సముచితస్థానం కల్పించాలి

ఊట్కూరు: ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర్య వేడుకల్లో విధిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి సముచిత స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు డీకే నర్సింహ, శంకర్, రాజు తదితరులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ నాయకులతోపాటు అంబేద్కర్ చిత్రపటాన్ని పతాకావిష్కరణ కార్యక్రమంలో ఉంచాలని ఆయన కోరారు.

విద్యార్థినికి సన్మానం



ధన్వాడ: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్ చదువుతున్న నాగలక్ష్మి అనే విద్యార్థి ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీలకు ఎంపిక కావడంపై బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ గంగమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులను సన్మానించారు. మందిపల్లి తండాకు చెందిన నాగలక్ష్మి ఈ నెల 19నుంచి 30 వరకు చెన్నైలో జరిగే ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని వారు కోరారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాగనూర్: శాస్త్ర, సాంకేతికరంగాల్లో చోటు చేసుకుంటున్న నూతన ఆవిష్కరణలను విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుంటూ ఉండాలని, అప్పుడే ఉన్నతంగా రాణించగలుగుతారని గ్రామ సర్పంచ్ రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై అవగాహన పెంచుకుంటే టెక్నాలజీపై ఆసక్తి పెరిగి భవిష్యత్‌లో మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. అనంతరం సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన వివిధ రకాల ఎగ్జిబిట్లను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వరి, ఉపాధ్యాయులు మధుసూదన్, వనయ్య, యేసు, సంధ్య, భారతి, నర్సింహులు, ప్రియాంక, అక్షర, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం పట్టివేత



మరికల్: మండలంలోని మాధవరంలో ఓ కిరాణ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి నల్లబెల్లం పట్టుకున్నారు. హనుమాన్ కిరాణ దుఖాణంలో రవి అనే వ్యాపారి గత కొన్నిరోజుల నుంచి గుట్టుచప్పుడుగా నల్లబెల్లం నిల్వ ఉంచి తాండల్లో సా రా తాయారు చేసే వారికి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 200కిలోల బెల్లం పట్టుకున్నారు. పట్టుబడ్డ బెల్లాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దుకాణంలో బెల్లం అక్రమంగా నిల్వ ఉంచిన వ్యాపారిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కర్పూరి ఠాకూర్‌కు ఘన నివాళి

అమరచింత: బీహార్ మాజీ ముఖ్యమంత్రి నాయి బ్రాహ్మణ సేవాసంఘం ముద్దు బిడ్డ కర్పూరిఠాకూర్‌కు భారత రత్న ప్రకటించడం హర్షణీయమని మండల నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, శివన్న తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ కూడలిలో కర్పూరి ఠాకూర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈమేరకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, అనిల్, రాఘవేంద్ర, జగన్నాథం, మన్యం, మాసన్న, బలరాం, శ్రీను, నారాయణ, రాజు, బాలస్వామిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

‘ఉపాధి’ నిధులతో రైతుబజార్లు

- జిల్లాకు రూ.92.35 లక్షలు మంజూరు
- గరిష్టంగా రూ. 15 లక్షల వరకు ఖర్చు
- స్థలాల లభ్యత సవాలే..?
- ప్రజాప్రతినిధులు చొరవ చూపితే తీరనున్న ఇబ్బందులు



ఊట్కూర్‌మండలం బిజ్వార్‌లో నిర్మించిన సమీకృత మార్కెట్ ద్వారం

నర్వ: మహాత్మగాంధీ ఉపాధిహామీ పథకం నిధులతో సంతలు నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఈ పథకం కింద ఇప్పటికే గ్రామాల్లో హరితహారం, మిషన్ కాకతీయ, సీసీ రహదారులు, రైతువేదికలు, పశువులు, గొర్రెల పాకలు, పంచాయతీ భవనాలు, వైకుంఠదామాలు, మరుగుదొడ్లు, పాంపాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటితోపాటు సంతనిర్మాణాలకు అవకాశం కల్పించినా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఆదరణకు నోచుకోలేదు. తాజాగా గ్రామాల్లో సంతలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముందుకొచ్చే పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి..

పట్టణాల్లో సమీకృత మార్కెట్‌యార్డుల మాదిరిగా పల్లెల్లోను రైతు సంతబజార్ ఏర్పాటుతో స్థానికంగా పండ్లు కూరగాయలు, వివిధ సామాగ్రి విక్రయించుకునే వారికి ఎంతో దోహదపడుతుంది. గ్రామ జనాభా, స్థలం, నిధుల లభ్యతను పరిగణలోకి తీసుకోని పంచాయతీలో నిర్మాణాలకు ముందుకురావాల్సి ఉంది. గదులతోపాటు ఫ్లాట్‌ఫాం, నీటివసతి, మూత్రశాలలు, మురుగుకాల్వలు, పార్కింగ్ స్థలాలు అభివృద్ధి చేస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి వాటా ధనం చెల్లిస్తే నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

స్థలాల లభ్యత సవాలే..

జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో దాదాపు కొన్ని పంచాయతీలు మాత్రమే తైబజార్ వసూలు చేస్తున్నాయి. మిగితా వాటిలో సంతా నిర్వాహణకు సౌకర్యాలు లేవు. చాలా చోట్ల రోడ్లపైనే చిరువ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఉదహారణకు నర్వ మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరుగుతున్న వారంతపు సంతరహదారి మీదనే జరుగుతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని పాథర్చేడ్‌లో సోమవారం నిర్వహించే వారంతపు సంత డబుల్‌రహదారిపై నిర్వహిస్తుండడంతో జక్లేర్, నర్వ గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సమీకృత మార్కెట్‌ల నిర్మాణాలు చేపడితే ఈ సమస్యకు పరిష్కారం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్య కేవలం నర్వ మండలమే కాకుండా ఇలా జిల్లాలోని అన్ని మండలాల్లోని రహదారులపై నిర్వహిస్తున్న వారంతపు సంతలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయా మండలాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం నిర్మాణాలకు పచ్చ జెండా ఊపినా.. స్థలాల కొరత ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. పాలకవర్గాలు అందుబాటులో ఉన్న స్థలాల్లో సంతలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

రహదారిపై సంతతో ఇబ్బందులు..

ప్రతి సోమ, మంగళవారం పాథర్చేడ్, నర్వలో నిర్వహించే వారంతపు సంతతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అందించే ఉపాధి, పంచాయతీ నిధులు ద్వారా సమీకృత మార్కెట్‌ను నిర్మాణం చేస్తే.. సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

\- పల్లెశేఖర్, పాథర్చేడ్ గ్రామస్తుడు

సమీకృత మార్కెట్‌ల నిర్మాణాలు చేపట్టండి..



ఉపాధి నిధుల ద్వారా సమీకృత మార్కెట్ నిర్మాణాలు చేపట్టాలని ప్రోత్సహిస్తున్నాం. ఊట్కూర్ మండలం బిజ్వార్, ధన్వాడ మండలం కొండాపూర్‌లో సమీకృత మార్కెట్‌ల నిర్మాణాలు చేపట్టాం. రహదారులపై నిర్వహిస్తున్న వారంతపు సంతలలో ఇబ్బందులు లేకుండా ప్రజాప్రతినిధులు చొరవ చూపితే మార్కెట్‌లు నిర్మాణాలు చేసుకోవచ్చు.

\- గోపాల్‌నాయక్, డీఆర్డీఓ నారాయణపేట

నిధులు ఇలా ..

కేటగిరి- 1 విభాగం (రూ. లక్షల్లో)	
పెద్ద పంచాయతీలకు (30 గదులు)	15 లక్షలు
ఉపాధిహామి నిధులు	10 లక్షలు
గ్రామ పంచాయతీ వాటా	05 లక్షలు
కేటగిరి- 2	
చిన్న పల్లెలకు (20 రూములు)	12.50 లక్షలు
ఉపాధి నిధులు	09 లక్షలు
పంచాయతీ వాటా	03. 50 లక్షలు

మండలం	మంజూరు	ఎస్టీమేషన్ రూ.
ధన్వాడ	02	రూ. 24.17 లక్షలు
కోస్గి	01	రూ. 15 లక్షలు
క్రిష్ణ	02	రూ. 24.17 లక్షలు
మరికల్	01	రూ. 15 లక్షలు
ఊట్కూర్	01	రూ. 15 లక్షలు

మంజూరైన నిధులు మొత్తం 92.35 లక్షలు
మొత్తం ఎస్టీమేటేడ్ : 07
పని ప్రారంభమైనవి : 04
పని పూర్తి అయినవి : 01

ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలి



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

నారాయణపేట: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహన ర్యాలీలు, ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనాదాయం పడిపోయి పేదరికం పెరిగిపోతున్నదన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తిరిగి రాయితీలను ప్రకటిస్తూ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. రైతాంగ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు రాతపూర్వకంగా హామీలు ఇచ్చిందన్నారు. ఈకాలంలో వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, పైగా కార్పొరేట్లకు మరిన్ని లాభాలు చేకూర్చేందుకు మోదీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా జనవరి 26న గ్రామీణ బంధును జయప్రదం చేయాలన్నారు. కాశీనాథ్, కెంచె నారాయణ, రాములు, ప్రశాంత్, నరసింహా, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం కోసం వినతి

మరికల్: మండలంలోని తీలేర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణం కోసం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చర్యలు తీసుకోవాలని బుధవారం ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. పేదల కోసం పెళ్లిళ్ల కోసం కల్యాణ మండపం ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. ఛత్రపతి యువజన సంఘం నాయకులు నవీన్‌గౌడ్, రాజు, నాగరాజ్, నరేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మాగనూర్: క్రీడాలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని కల్గిస్తాయని సర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం వెంకటయ్యకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడా సామాగ్రిని వినియోగించుకుని విద్యార్థులు క్రీడలో రాణించాలని కోరారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని అన్నారు. సర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సప్ప, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి శివదీక్షలు ప్రారంభం

- ప్రతి సంవత్సరం మాలధారణపై పెరుగుతున్న ఆసక్తి
- ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధతో ఉండాలి
- మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులకు శివమాలధారణ



అలంకరణలో శివుడు



మక్తల్‌లో మల్లికార్జునస్వామి దేవాలయం

మక్తల్: ప్రజలు చెడు మార్గంలో ప్రయాణించేటప్పుడు మంచి మార్గంలోకి అజ్ఞానం నుంచి జ్ఞానవంతులుగా మారడానికి, దుర్మార్గాన్ని వదిలి సన్మార్గాన్ని పొందడానికి, శివ సాక్షాత్కారాన్ని పొందడానికి శివానుగ్రహాన్ని పొందడానికి ఈ శివ దీక్ష మాలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ధరిస్తారు. చెడు మార్గంలో ప్రయాణించే వారు చెడు అలవాట్లు ఉన్న వారు మంచి మార్గంలో నడవడానికి, జ్ఞానవంతులు సన్మార్గాన్ని పొందడానికి శివ దీక్షలు స్వీకరిస్తారు. 41రోజులుగా శివదీక్షలను ధరించిన వారు శ్రీశైలంలోని మల్లికార్జునస్వామి సన్నిధిలో మాలధారణ చేస్తారు.

దీక్షలు వేసే రోజులు..

శివదీక్షలు రోజులు వాటిలోని జనవరి 25, 26, 27వరకు 41రోజులు వేసే భక్తులకు అవకాశం ఉంటుంది. అర్ధమండల దీక్షలు వేసేవారికి ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో మాలవేసేవారికి చివరి అవకాశం ఉంటుందని వేదా పండితులు తెలిపారు. మాలధారణ చేసిన వారికి మహాశివరాత్రి మార్చి 8న అమవాస్యకు ముగిస్తుంది.

భక్తులు పాటించాల్సిన నియమాలు..

- శివదీక్షలు వేసే వారు స్వయంగా శివబావన కలిగిన గోధుమరంగు కలిగిన వస్త్రాలను ధరించాలి
- ఒక్క పూట భోజనం చేయాలి
- అరుణోదయ, మధ్నాహ్నం, సాయంత్రం శివ పూజను ఆచరించాలి
- ప్రతి ఒక్కరూ భక్తితో అధ్యాత్మికతో ఉండాలి. శాంతితో ఉండాలి
- సూర్యోదయం, సూర్యస్తమయం సమాయల్లోనే చల్లని నీటితో స్నానం చేయాలి. ఎనిమిది శతకమాన పూజలు చేసేందుకు

సాధ్యం కానివారు స్వాములు లింగాష్టకం పఠించి పంచాక్షారి మంత్రాన్ని 108సార్లు జపించాలి

- పదేళ్లలోపు బాలికలు, 60ఏళ్ల వయస్సు వారు దీక్షను ఆచరించవచ్చు
- ఏకాగ్రతతో మంచి మనుస్సుతో పూజను ఆచారించాలి
- మాట్లాడే ముందు ప్రతి ఒక్కరిని స్వామి అని పిలువాలి, ప్రతి ఒక్క శివభక్తుడు నేలపైనే పడుకోవాలి,

దీక్షలో చేయకుండా ఉండే పనులు..

- క్షవరం చేసుకోకూడదు
- గోళ్లు తీయడం చేయొద్దు
- దూమపానం, మద్యపానం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- దీక్షలు పూర్తయేంతవరకు పాదరక్షలు ధరించొద్దు

శివుడి అనుగ్రహంతో ఉండాలి..



ప్రతి శివభక్తుడు శివుడి అధ్యాత్మిక సందేహంతోనే ఉండాలి. పూజచేసే సమయంలోనే ఓంనమఃశివాయ నామకరణంతో పూజలు చేయాలి. ప్రతి సంవత్సరం శివదీక్ష మాలధారణ వేస్తున్నాం. 34సార్లు గురు శివ దీక్షను ధరించి ప్రస్తుతం 35వ సారి మాలధారణ వేస్తున్నాం. శివుడి అనుగ్రహంతోనే ఉంటున్నాం.

\- తిప్పయ్యస్వామి, ఆలయ పూజరి, మక్తల్

బాలికల అభ్యున్నతికి కృషి చేయాలి



నారాయణపేటలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు



మాగనూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

నారాయణపేట: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలతో బుధవారం బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన నిర్వహించారు. ఈ సదస్సులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మిపతిగౌడ్, డి.దత్తాత్రేయ, నాగేశ్వరి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డిఫెన్స్ కౌన్సెల్స్ న్యాయవాది రఘువీర్‌యాదవ్ మాట్లాడారు. బాలికల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంబంధ ఖర్చులను భరిస్తున్నాయన్నారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల చాలా మంది అమాయక బాలబాలికలు తెలిసి తెలియని వయసులో ఆకర్షణకు గురై వేధింపులకు లోనవుతున్నారన్నారు. బాల, బాలికలు బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. అనంతరం ఉచిత న్యాయ సహాయం, అమలు వంటివి న్యాయ సేవా సంస్థ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ శాలిని మాట్లాడుతూ బాలికలను చదవనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదంతోపాటూ బాలికల సంరక్షణ బాధ్యతలను వివరించారు. పద్మ, జ్యోతి, సునితా, గిరిజారాణి, శోభారాణి, తిరుపతమ్మ, శశికళ, శాంత, ఇందిరా, అశ్విని, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: విద్యార్థినులు ఉన్నత చదువులు చదవాలని, మంచి ఉద్యోగాలు సాధించాలని పాఠశాల హెచ్‌ఎం శివరాజ్ అన్నారు. బుధవారం బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. చిన్న పిల్లలు, విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలు, పౌరుల హక్కులు తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాధాయులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బాలికా విద్యపై ఇంకా కొన్ని చోట్ల వివక్ష కొనసాగుతుందని గుర్తుచేశారు. బాలికల వారి హక్కులను తెలుసుకొని, సమాజంలో అందరు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు పలు రకాల ప్రదర్శనలతో పలువురిని ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి, కో–ఆర్డినేటర్ పరిమళ, దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కృష్ణాలో విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పంచాయతీ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్: మండలంలోని పలు అభివృద్ధి ప్రారంభోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రారంభించారు. మరికల్, పల్లెగడ్డ గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలు, తీలేర్‌లో మనఊరు –మన బడి పథకం కింద నిర్మించిన అదనపుగది, మరుగుదొడ్లను, మాధవరంలో మహిళ సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సురేఖ, సర్పంచ్‌లు గోవర్ధన్, ఆంజనేయులు, రేవతమ్మ, పూణ్యశీల, ఎంపీటీసీలు గోపాల్, సుజాత, మండల అధ్యక్షుడు వీరన్న, విష్ణు, సూర్యమోహన్, హరిష్, రామకృష్ణ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మాగనూర్: మండలంలోని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధికారులు అన్నారు. ఆదివాసి గౌరవ్ దివస్ సందర్భంగా 2023 నవంబర్ 15న ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతుందని ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ సుమన్ తెలిపారు. అనంతరం పలు పథకాలపై ఆయా అధికారులు అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామస్తులకు ప్రత్యేకంగా హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి విరోజ, ఏఎన్‌ఎం సుధా, రాధిక, ఆశాకార్యకర్తలు కృష్ణవేణి, రేణుక, సరిత, గ్యాస్ ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ



వార్డుసభ నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ బృందం

మాగనూర్: గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు స్థానికంగానే పనులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకంలో జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి వ్యక్తికి ఏడాదిలో వంద రోజుల పాటు పని కల్పిస్తారు. అనంతరం మండల స్థాయిలో ప్రజావేదిక సభ నిర్వహించి సామాజిక తనిఖీపై గ్రామాల వారీగా నివేదికలను ప్రజాప్రతినిధుల సమక్షంలో చదివి వినిపిస్తారు. ఇందులో భాగంగా మండలంలో బుధవారం నుంచి తనిఖీ బృందాలు క్షేత్రస్థాయి పనులపై తనిఖీలు ప్రారంభించారు. 24 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు గ్రామస్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయి పర్యటించి చేపట్టిన పనులను పరిశీస్తారు. ఒక ఎస్‌ఆర్‌పీ, ఆరు మంది, డీఆర్పీలు, ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల సాయంతో పనుల పరిశీలన నిర్వహించారు. బుధవారం అడవిసత్యారం, మందిపల్లి, వడ్వాట్, వర్కూర్, నేరడగం గ్రామాలల్లో తనిఖీ బృందాలు పర్యటించారు.

పైప్‌లైన్‌కు అనుమతి ఇప్పించండి

ఆత్మకూర్: మండలంలోని దేవరపల్లిలో తాగునీటి ఎద్దడి ఉందని, రైల్వేలైన్ ఉన్న కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు కరీంనగర్ ఎంపీ బండిసంజయ్‌కు విన్నవించుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో బండిసంజయ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే లైన్ కింద నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతి ఇప్పించాలని కోరారు.